క్లుప్తంగా

ప్రభుత్వ బడుల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఎంఈవో తిరుపతిరెడ్డి తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. హెచ్ఎం లాల్‌సింగ్, వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీ వాడకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. సాయిలు, బక్క రమేష్, వడ్డేపల్లి రమేష్, బక్క గంగారాం, రవి కుమార్, రాజు దేవయ్య, కృష్ణ, బాలరాజ్, లక్ష్మణ్, బాలు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలన్నీ బీజేపీవే..



లింగంపేట(ఎల్లారెడ్డి): త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలన్నీ బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని పార్టీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు అల్లూరి, మల్లయ్య, కిషన్, శివ్వయ్య, నరేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

గుడ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని మోడల్‌స్కూల్ విద్యార్థినులకు గురువారం షీటీం సభ్యులు గురువారం గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే షీటీంకు సమాచారం అందించాలని అన్నారు. షీటీం సభ్యులు శ్రీశైలం, సుప్రజ తదితరులున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ విజయ దశమి ఉత్సవం



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని గంజ్ రామాలయంలో గురువారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అంబేడ్కర్ బస్తీ విజయ దశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సామాజిక సమరసత ఇందూర్ విభాగ్ సహ సంయోజక్ సంగన్నగారి బాల్‌రాజ్‌గౌడ్ వక్తగా హాజరై, మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ భావంతో వందేళ్లుగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ స్వతంత్రంగా నిలబడడం సామాన్య విషయం కాదన్నారు. యోగాచార్యులు యెల్లంకి సుదర్శన్, నగర కార్యవహ శివరాజు, బస్తీ ప్రముఖ్ కనకంటి రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టు



భిక్కనూరు: ఛలో బస్ భవన్‌కు వెళ్లకుండా భిక్కనూరు మండల బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు నలుగురిని భిక్కనూరు పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తున్కి వేణు, ఎంపీటీసీల ఫోరమ్ మండల మాజీ అధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, సీనియర్ నాయకుడు కందది రమేష్‌ను పోలీసులు అరెస్టు చేసి సాయంత్రం సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు.

పట్టణంలో అడవి పందులు..



ఎల్లారెడ్డిలో జనావాసాల మధ్య సంచరిస్తున్న అడవి పంది (ఫైల్)

- ఎల్లారెడ్డిలో స్వైరవిహారం చేస్తున్న వైనం
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిరూరల్: అడవిలో సంచరించాల్సిన అడవిపందులు జనావాసాల మధ్య తిరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో అడవి పందులు సంచరిస్తున్నా సమస్యను అధికారులెవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

ప్రజలపై దాడులు..

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల రాశివనంలో అడవి పందులు స్థావరం



గాయపడిన ఏసవ్వ (ఫైల్)

ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో అక్కడి విద్యార్థులు, జనాలు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే సీఎస్ఐ చర్చి పరిసర ప్రాంతంలో సైతం అడవిపందులు సంచరించడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన ఏసవ్వ ఇంటి నుంచి పొలానికి వెళ్తున్న సమయంలో అడవిపంది దాడి చేయడంతో అమె కాలు విరిగి తీవ్రంగా గాయపడింది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి, అడవి పందులను పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించేలా చర్యలను తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలికి గాయమైంది..

ఇటీవల ఇంటి నుంచి పొలానికి వెళ్తున్న సమయంలో అడవి పంది దాడి చేయడంతో కాలికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లగా వారు కామారెడ్డికి రిఫర్ చేశారు. అధికారులు స్పందించి అడవిపందులను గ్రామాలలో సంచరించకుండా చర్యలను తీసుకోవాలి.

– ఏసవ్వ, రుద్రారం

భయమేస్తోంది..

ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గల రాశి వనంలో అడవిపందులు ఉండడంతో అక్కడి నుంచి పొలానికి వెళ్లాలంటే భయంగా ఉంది. అధికారులు పట్టణంలో సంచరిస్తున్న అడవి పందులను పట్టుకుని అటవీ ప్రాంతాలలో వదిలి వేసేలా తగిన చర్యలను తీసుకోవాలి.

– సాయిలు, ఎల్లారెడ్డి

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

జనావాసాల మధ్య బురద గుంతలు, పొదలు ఉన్న ప్రాంతాలలోకి పందులు సంచరించే అవకాశం ఉంటుంది. కాబట్టి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. జనావాసాల మధ్య పందులు సంచరించి మనుషులపై దాడులకు పాల్పడితే ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందజేస్తాం.

– చరణ్‌తేజ, ఎఫ్‌ఆర్‌వో, ఎల్లారెడ్డి

సర్వీస్ రోడ్లపై అంధకారం

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామం వద్ద ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపై అంధకారం అలుముకుంది. కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలకగపోవడంతో పరిసర ప్రాంతమంతా చీకటిగా మారుతోంది. దీంతో వాహనాదారులు, స్థానికులు రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు ఈ విషయమై ఎన్‌హెచ్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సర్వీస్ రోడ్లపైన వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జంగంపల్లి సర్వీస్ రోడ్డుపై వెలగని వీధి లైట్లు

నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్ పార్వతీపుత్ర పరివార్ కమిటీ (పంచాయతీరాజ్ ఈఈ ఆఫీసు ఏరియా) నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరి, ప్రధాన కార్యదర్శిగా మెరుగు రాజు, సంయుక్త కార్యదర్శిగా చాట్ల జనార్ధన్, కోశాధికారిగా కాశీనాథం ఎన్నికయ్యారు. ప్రతినిధులు సతీష్, భరత్, భూపాల్‌రెడ్డి, దత్తాత్రి, రామచంద్రగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, నాగేంద్ర, రామకృష్ణ, శ్రీధర్, నవీన్, అంజనేయులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హైవే బ్రిడ్జి వద్ద గల సర్వీస్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో బీటీ రోడ్డుపై భారీ గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, ఆర్టీసీ బస్సు డ్రైవర్‌లు కూడా ఈ రోడ్డు గుండా వాహనాలను నడపడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి సారించి గుంతలు పడ్డ సర్వీస్ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులిచ్చినా.. నిర్మించడం లేదు..



టాయిలెట్స్ వద్ద క్యూలో ఉన్న విద్యార్థినులు

- బిచ్కుంద జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.6.90 లక్షలు మంజూరు
- నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రారంభం కాని పనులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై, నెలలు గడుస్తున్నా, పనులు ప్రారంభం కావడం లేదు. ప్రస్తుతం పాఠశాలలో మూడు వందల మంది విద్యార్థినులకు కేవలం మూడు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయి. మూత్రశాల వద్ద వారు క్యూలో నిలబడి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడ మరుగుదొడ్లు లేక విద్యార్థులు కొందరు ఇంటి వెళ్తున్నారు. ఈ సమస్యను ఆగస్టు 23న 'మూడొందల మందికి ఒకే టాయిలెట్' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ సమస్యపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించి, మరుగుదొడ్లు నిర్మించాలని ఎంపీ లాడ్స్ కింద రూ. 6.90 లక్షలు నిధులు మంజూరు చేస్తు ప్రొసీడింగ్ జారీ చేశారు. కానీ కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ రెండు నెలలు కావస్తున్న మండల అధికారులు నేటికి మరుగుదొడ్ల పనులు ప్రారంభించలేదు. పనులు ప్రారంభించాలని అధికారులను హెచ్ఎం కోరిన స్పందన లేదు. నిధులు ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి త్వరగా మరుగుదొడ్ల పనులు ప్రారంభించే విధంగా చూడాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పీడీ సభాత్‌కృష్ణ తెలిపారు. పాఠశాలకు చెందిన అర్చన, నందిని, సాకేత్, మనోహర్ అనే విద్యార్థులు ఇటీవల జిల్లాస్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 10, 11, 12 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో వారు పాల్గొంటారని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..



సదాశివనగర్ (ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7న కామారెడ్డిలో అండర్ 19 విభాగంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించగా కళాశాలకు చెందిన క్లైం సౌందర్య, సేనావత్ చరణ్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్, ఇన్‌చార్జి పీడీ రాజేందర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు..



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ గురువారం తెలిపారు. గాంధారి మండలంలో నిర్వహించిన పోటీలలో అయాన్, ప్రణదీప్, అనాస్‌లు అండర్ 14, 17 విభాగాలలో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



అడ్లూరు ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న జాజాల సురేందర్

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్
- ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి, ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకుడు జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో గురువారం ఆయన కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మరచి మోసం చేస్తోందన్నారు. బాకీ కార్డులను నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇంటింటికి చేరేవిధంగా కార్యకర్తలు నాయకులు చూడాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపకుండా కాలయాపన చేస్తూ కోర్టు కేసుల పేరుతో, రిజర్వేషన్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత ఉందని, కొందరు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు కమిలి నర్సింలు, రాజేశ్వరరావు, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మొహినుద్దీన్, దొడ్ల రవి, శ్రీనివాస్ నాయక్, గడిల భాస్కర్, అల్తాఫ్, సాయ గౌడ్, టైల్స్ నర్సింలు, శివ, శేఖర్ రెడ్డి, కపిల్ రెడ్డి, పబ్బ సంజీవులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గండివేట్, గండివేట్ తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గురువారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకుడు జాజాల సురేందర్ బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చిటికె రమేష్, నేనావత్ నర్సింగ్, శివ, తానాజీరావు, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలో అకాలం వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరానికి రూ. 50వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. రైతులను ఆదుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు కంజర భూమన్న, దశరథ్, బాలరాజ్, దేవయ్య, మోతే బాలరాజ్, సాయాగౌడ్, సాయిలు, హన్మండ్లు, ప్రవీణ్ ఉన్నారు.

ఎన్నికల్లో అధిక స్థానాలు గెలవాలి



భిక్కనూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటి, అధిక స్థానాలను గెలవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ అన్నారు. భిక్కనూరులోని ఎస్వీ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన పట్టణ కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానంలో పార్టీ అధిష్టానం సూచించిన అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఇచ్చి అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. నాయకులు అందే దయాకర్‌రెడ్డి, శ్రీరాం వెంకటేష్, నర్సింహరెడ్డి, విజయకుమార్‌గౌడ్, సాజీద్, నీల అంజయ్య, నాగరాజు, సిద్దగౌడ్, సురేందర్‌గౌడ్, కొట్టని స్వామి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

బాన్సువాడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం రాజులు అన్నారు. బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామానికి చెందిన వడ్ల శేఖర్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువారం బాన్సువాడలో బీజేపీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. నాయకులు కోనాల గంగారెడ్డి, రూరల్ అధ్యక్షుడు మజ్జిగ శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, చీదరి సాయిలు, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, హన్మండ్లు యాదవ్, హరికృష్ణ, నాగరాజు, దత్తు, సాయిరెడ్డి, లక్ష్మణ్, సురేష్, సంజీవ్ తదితరులు ఉన్నారు.



నాయకులకు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు నీలం రాజులు

నూతన బీడీ పెన్షన్ అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నూతన బీడీ పెన్షన్ రూ. 4016 హామీని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 కటాఫ్ డేట్ తొలగించి బీడీ కార్మికులందరికీ ఎలాంటి షరుతులు లేకుండా నూతన పెన్షన్ అమలు చేయాలన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఈనెల 11న ఉమ్మడి జిల్లా పర్యటనలో నూతన పెన్షన్ అమలు చేస్తామని హామీ ఇవ్వాలని కోరారు. యూనియన్ జిల్లా కోశాధికారి కర్రోల సత్యం, నాయకులు ప్రభుదాస్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి



కామారెడ్డి అర్బన్: జిల్లాలో వెంటనే వరి, మక్క, పత్తి, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోళ్లు ప్రారంభించాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, రైతులు మోసపోకుండా ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కల్పించడానికి రైతు సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. నాయకులు అర్ల శంకర్‌రావు, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బాన్సువాడలో ఫిజియోథెరపీ శిబిరం



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని భవితకేంద్రంలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. రిసోర్స్ టీచర్ వెంకట పద్మ మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు ప్రతిరోజు వ్యాయామం చేయించాలని అన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు వసంత్, ఫిజియోథెరపిస్టు గంగాధర్ పాల్గొన్నారు.

వాహనాల అంగడిలో తనిఖీలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని చర్చి గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన వాహనాల అంగడిలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విక్రయానికి సిద్ధంగా ఉంచిన ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ ఎస్సై మహేష్, సిబ్బంది తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు, అనుమతులను పరిశీలించారు. అన్ని పత్రాలు సరిచూసుకున్న తర్వాతే వాహనాలు కొనుగోలు చేయాలని ఎస్సై మహేష్ సూచించారు.

'స్వచ్ఛందంగానే కాంగ్రెస్‌ను వీడాను'



సదాశివ నగర్(ఎల్లారెడ్డి): తనను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసినట్లు ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందని, తానే స్వచ్ఛందంగా పార్టీ నుంచి తప్పుకున్నానని మండలానికి చెందిన నాయకుడు ఏలేటి భూమిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో నైతిక విలువలు లేవని, ఇది గమనించే మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరడానికి మాజీ మంత్రి హరీష్ రావును ఇటీవల కలిసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే హరీష్ రావు ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



కామారెడ్డి రూరల్: మండలంలోని ఇస్రోజీవాడి గ్రామం నుంచి కామారెడ్డి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన యువకులు అజిత్, సాయిలు గురువారం రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చారు. వారిని గ్రామస్తులు అభినందించారు. వర్షానికి రోడ్డు మొత్తం కొట్టుకుపోయిందని అధికారులు స్పందించి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.